


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

సోమవారం 26 ఆగష్టు 2024 9 పేజీలు


# హడలెత్తిస్తున్న హైడ్రా...



- భూ కబ్జాదారుల గుండెల్లో గుబులు
- అక్రమ నిర్మాణాలే టార్గెట్
- ప్రభుత్వ భూములు,చెరువులు,కుంటలు పరిరక్షనే ముఖ్య ఉద్దేశం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విచ్చల విడిగా భూకబ్జాలు
- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు చర్యలు

సూర్య కరీంనగర్ ప్రతినిధి

బోనాల వెంకటేశ్



"హైడ్రా" ఈ పేరు వింటేనే భూ కబ్జాదారుల గుండెలు హడలెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా పేరుతో కూల్చి వేయడం జరుగుతుంది. చెరువులు, కుంటలు పరిరక్షణ ముఖ్య ఉద్దేశంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు,చెరువులు, పార్కులు మొదలగునవి విచ్చలవిడిగా కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ భూములను కాపాడుతుంది. హైదరాబాద్ నగరంలో కొనసాగుతున్న ఈ తంతు త్వరలోనే జిల్లా కేంద్రాలకు... జిల్లాలకు అమలుపరిచే దిశగా ప్రభుత్వం భావిస్తోందని తెలుస్తుంది. దీనితో భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేసిన భూకబ్జాదారులు ఆందోళనకు గురవుతున్నారు. (వివరాలు 2లో)

# విదేశాలకు మేయర్...




## - డిప్యూటీ మేయర్‌కు భాధ్యతలు అప్పగించని వైనం...

- చర్చకు దారి తీసిన మేయర్ వ్యవహార తీరు
- భగ్గుమంటున్న కార్పొరేటర్లు
- కలెక్టర్‌కు ఫిర్యాదు

2లో



సూర్య కరీంనగర్ ప్రతినిధి

కరీంనగర్ బల్దియాలో మరోసారి మేయర్ వ్యవహారతీరు చర్చకు దారితీసింది. మేయర్ అమెరికా పర్యటనకు వెళ్ళడం వివాదాస్పదంగా మారింది..స్వల్ప విరామంతో విదేశీ పర్యటన వెళుతున్నాను అని చెప్పి కనీసం ఇన్చార్జి బాధ్యతలు కూడా ఎవరికి అప్ప చెప్పకుండా ..ఒకవేళ అప్పగిస్తే బీసీ మహిళ కు మేయర్ పదవిని అప్పగించాల్సి వస్తుందని ముందే ఊహించి బీసీ మహిళ బాధ్యత చేపట్టడం ఇష్టం లేక మేయర్ విదేశాలకు వెళ్లడం తీవ్ర విమర్శలకు దారి తీసింది...కరీంనగర్ మున్సిపాలిటీలో కొంతకాలంగా మేయర్ సునీల్ రావు వ్యవహార శైలి తీవ్ర వివాదాలకు దారి తీసింది... పేరుకే ఒకే పార్టీకి చెందిన మేయర్ డిప్యూటీ మేయర్ అయినా పాలనలో మాత్రం మేయర్ సునీల్ రావు వ్యవహారం ఏకఛత్రాధిపత్యంగా వ్యవహరిస్తూ ఒంటెద్దు పోకడతో వెళ్తున్నది జగమెరిగిన సత్యం. సొంత పార్టీ కి చెందిన డిప్యూటీ మేయర చల్ల స్వరూప రాణిని ఏ రోజు పాలనలో పరిగణనలోకి తీసుకోకుండా దూరం పెట్టీ ఏకపక్షంగా వ్యవహరించడంతో ఇద్దరి మధ్య కొంతకాలంగా కోల్డ్ వార్ నడుస్తోంది.



# అధికారులకు తాకనున్న రుణమాఫీ సెగ...?



- అర్హత ఉండి రుణమాఫీ కాని రైతుల ఆందోళన బాట
- అధికారుల అలసత్వమే అంటున్న బాధిత రైతులు
- అర్హులందరికీ వర్తింప జేసామంటున్న అధికారులు
- పొంతన లేని ప్రకటనలతో అయోమయంలో అన్నదాత

సూర్య జగిత్యాల

ఎరువులు విత్తనాలు, పురుగు మందులు ఇలా నకిలీలతో అనేక సందర్భాల్లో మోసపోయే రైతులు ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో పేర్లు లేకపోవడంతో ఇదో రకం మోసమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు లక్షల వరకు పంట రుణాలను అందరికీ ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు దఫాలుగా మాఫీ ప్రకటనతో మొదటి విడత రుణమాఫీ జూలై 18న, రెండో విడత జూలై 30న, మూడో విడత ఆగస్టు 15న రుణమాఫీ అవుతుందని ఆనందం వ్యక్తం చేసిన రైతుల్లో అనేక మంది పేర్లు గల్లంతు కావడంతో ఆందోళన నెలకొంది. దీంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుంది. మొదటి జాబితాలో మాఫీ కాని వారికి రెండో విడతలో అవుతుందని, రెండో విడతలో కూడా తమ పేర్లు కనిపించక (మిగతా 2లో)



# విదేశాలకు మేయర్...
# డిప్యూటీ మేయర్‌కు భాధ్యతలు అప్పగించని వైనం

(మొదటి పేజీ తరువాయి)

**- మహిళను అవమాన పరచడమే**

మేయర్ సునీల్ రావు వ్యవహార శైలి పట్ల సొంత పార్టీ నాయకులే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మేయర్ హోదాలో మొదటిసారి విదేశీ పర్యటనకు వెళ్ళిన సునీల్ రావు నిబంధనల ప్రకారం 15 రోజులు అందుబాటులో లేకుంటే డిప్యూటీ మేయర్ కు మేయర్ బాధ్యత అప్పగించి వెళ్లాల్సి ఉంటుంది. కానీ మేయర్ బీసీ మహిళ అయిన డిప్యూటీ మేయర్ కు బాధ్యత అప్పగించడం ఇష్టం లేక కేవలం రెండు వారాలు మాత్రమే తాను విదేశీ పర్యటన వెళుతున్నాను అని చెప్పి అందరిని నమ్మించి ఏ ఒక్కరికి బాధ్యత అప్పగించకుండా అమెరికా వెళ్లడం మహిళ అయినా డిప్యూటీ మేయర్ ను అవమానించడమే అని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**- చెప్పింది14 రోజులు వెళ్ళింది 33 రోజులు**

మేయర్ సునీల్ రావు తాను స్వల్ప విరామం నిమిత్తం కేవలం 14 రోజులు మాత్రమే అమెరికా పర్యటనకు వెళ్తున్నట్లు అందరిని నమ్మించి తాను మాత్రం 33 రోజులు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవడం కలకలం రేపింది. ఈ నెల 28 న రాత్రి హైదరాబాద్ నుండి బయలు దేరి దుబాయ్ మీదుగా డల్లాస్ వెళ్లనున్న మేయర్ సెప్టెంబర్ 25న తిరిగి నగరానికి రానున్నట్లు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ప్రయాణికి చెందిన విమాన టికెట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. 33 రోజులు ప్లాన్ చేసుకున్న మేయర్ బయటకు మాత్రం స్వల్ప విరామం అని చెప్పిన ఆయన వెళ్లి వచ్చే విమాన టికెట్లు బయట పడటంతో మేయర్ చట్టాన్ని అతిక్రమించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**- మహిళ మేయర్ అయితే రికార్డే**

కరీంనగర్ మున్సిపాలిటీ 1952లో ఏర్పాటు అయిన నాటి నుండి నేటి వరకు ఏ ఒక్క మహిళా చైర్మన్ లేదా మేయర్ బాధ్యత చేపట్టలేదు. ఇప్పుడు డిప్యూటీ మేయర్ కు బాధ్యత అప్పగిస్తే కొత్త రికార్డు చరిత్రలో ఉంటుందని అందులో బీసీ మహిళ కు ఆ రికార్డు ఉండకూడదనే ఆలోచన తోనే మేయర్ సునీల్ రావు డిప్యూటీ మేయర్ కు బాధ్యత అప్పగించకుండ వెళ్ళాడని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. 60 మంది కార్పొరేటర్లు మెజారిటీ ఓట్ల ద్వారానే మేయర్ , డిప్యూటీ మేయర్ ఎన్నిక కాగా చట్టం స్పష్టంగా బాధ్యతలు అప్పగించ కుండా వెళ్లడం పట్ల మేయర్ కు బీసీ ల పట్ల చిన్నచూపు మరోసారి బయట పడిందని సొంతపార్టీ నుండే విమర్శలు రావడం గమనార్హం.

**- చట్టం చెబుతోంది ఇదే**

మున్సిపల్ చట్టం ప్రకారం 15 రోజుల పాటు నగరానికి దూరంగా ఉండే పక్షంలో మేయర్ తన బాధ్యతను డిప్యూటీ మేయర్ కు బాధ్యత అప్పగించాల్సి ఉంటుంది. దీని కంటే ముందు విదేశీ పర్యటనకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. పాత మున్సిపల్ చట్టం, కొత్త కార్పొరేషన్ చట్టం ఇదే విషయం చెబుతుండగా సునీల్ రావు మాత్రం కార్పొరేషన్ తన సొంత ఆస్తిగా భావించి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కనీసం ఇన్చార్జి బాధ్యతలు అప్పగించింది వెళ్లడం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది. ఇదే విషయమై కాంగ్రెస్ నాయకుడు జిల్లా కలెక్టరుకు చర్యలు తీసుకోవాలని మేయర్ సునీల్ రావుపై ఫిర్యాదు కూడా చేశారు.

**- రెండు రోజుల్లో డిప్యూటీ మేయర్‌కు మేయర్ బాధ్యతలు..??**

సొంత పనులపై విదేశాలకు వెళ్లిన మేయర్ ఎవరికి బాధ్యతలు అప్పగించకుండా పోవడంతో డిప్యూటీ మేయర్ దంపతులు జిల్లా కలెక్టరుకు కలిసి శనివారం విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మున్సిపల్ కమిషనర్ కు వినతిని పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. మేయర్ అందుబాటులో లేని పక్షంలో డిప్యూటీ మేయర్ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుందని కమిషనర్ ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ చేయగా రెండు రోజుల్లో అధికారికంగా చార్జీ ఇవ్వనున్నట్లు సమాచారం.

# అధికారులకు తాకనున్న రుణమాఫీ సెగ...?

(మొదటి పేజీ తరువాయి)

పోవడంతో ఫిర్యాదు చేసే రైతుల సంఖ్య ఎక్కువయింది. దీంతో మూడో విడత వరకు ఓపిక పట్టాలని సూచించడంతో రైతులందరూ ఇప్పటి వరకు ఎదురు చూశారు. మొదటి రెండు విడతల్లో రుణమాఫీ జరగలేదని స్పష్టంగా రైతులకు తెలిసినా మిన్న కుండిపోయారు.రేపో మాపో మాఫీ అవుతుందన్న ఆలోచించి ఓపిక పట్టిన రైతన్నకు మూడో విడతలోనూ తమ పేర్లు లేకపోవడంతో గ్రామాల్లో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ వర్తించని రైతులు అధికారుల వద్దకు వెళితే మా వద్ద ఏమి లేదని బ్యాంకులకు వెళ్లాలని తప్పించుకుంటున్నారని, బ్యాంకులకు వెళితే పట్టించుకోవడం లేదని ఈ నేపథ్యంలో బ్యాంకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి ఈ యేడు పంటల సాగును పక్కకు పెట్టే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. జిల్లాలో మూడు విడతల్లో జరిగిన రుణమాఫీ లో 67,243 మంది రైతులు లబ్ది పొందారు. వీరి 529.82 కోట్ల రుణాలు ప్రభుత్వం మాఫీ చేసింది. అయితే మూడు విడతల్లో అన్ని అర్హతలు ఉండి రుణమాఫీ వర్తించని రైతులు ఇంకా 40 వేల పైనే ఉంటారని జిల్లాలో ప్రచారం జరుగుతుంది.

## - రుణమాఫీ వర్తించని కారణాన్ని రైతులకు వివరించాలి

**- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**

రుణమాఫీ వర్తించని కారణాన్ని రైతులకు స్పష్టంగా తెలపాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఇటీవల కలెక్టరేట్ లో సమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అయితే అర్హత ఉండి రుణమాఫీ కాని రైతులకు క్షేత్ర స్థాయిలో వివరించడంలో అధికారులు విఫలం అవుతున్నారని విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులు రైతులు తమ వద్దకు వస్తే విసుక్కుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు క్లస్టర్ స్థాయిలో పరిష్కారం లభించడం లేదని భావించిన రైతులు కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటున్నారు.

**- రుణమాఫీలో తిరకాసులు**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు రుణమాఫీ చేయగా అందులో అనేక తిరకాసులు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు ప్రామాణికంగా చేసిన రుణమాఫీలో ఒక రైతు కుటుంబం పేరిట ఒక బ్యాంకులో 2 లక్షలు, మరి కొన్ని బ్యాంకుల్లో అన్ని కలిపి 10 లక్షలు అప్పు ఉంటే ఏదేని బ్యాంకుల్లో ఆ కుటుంబం పేరిట ఉన్న అప్పులో 8 లక్షలు చెల్లిస్తేనే 2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని అధికారులు కొర్రీలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. అంటే ఆ రైతు కుటుంబానికి 2 లక్షల రుణమాఫీ వర్తించాలంటే 8 లక్షలు చెల్లించాలి. కాగా ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు రెండు లక్షల రుణమాఫీ కోసం 8 లక్షలు ఎక్కడి నుండి తీసుకురావాలని ఆందోళనకు గురవుతున్నారు.

**- ఆందోళన బాట పట్టనున్న రుణమాఫీ బాధిత రైతులు**

అర్హత ఉండి రుణమాఫీ వర్తించని రైతులు జిల్లాలో ఆందోళన బాట పట్టనున్నట్టు తెలిసింది. ఈ మేరకు మేడిపల్లి మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో రైతులు ఇటీవల సమావేశం ఏర్పాటు చేసుకుని ఈ నెల 29 న జగిత్యాల - నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాస్తా రోకో చేయనున్నట్లు సమాచారం. అయితే జిల్లాలో ఏదో ఒక చోట ఆందోళనలు ప్రారంభం అయితే జిల్లా వ్యాప్తంగా ఉధృతంగా మారి ఆ సెగ అధికారులకు తగలనుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు జిల్లాలో అర్హత గల రైతులకు వెంటనే రుణ మాఫీ వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# బీసీల వెలుగురేఖ బీ.పి.మండల్

**సూర్య జగిత్యాల**

బీసీ లకు రిజర్వేషన్లు కల్పించి సమాజంలో తలెత్తుకొనేలా చేసిన ఘనత బీ పీ మండల్ కే దక్కుతుందని టీ బీసీ జేఏసి ,సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అన్నారు.ఆదివారం సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో టీ బీసీ జేఏసీ,సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో బీ పీ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ పితామహుడు బీ.పి.మండల్ అని అన్నారు.1979-80 లో బీ పీ మండల్ చైర్మన్ గా బీసీ ల అభివృద్ధికి అప్పటి కేంద్ర ప్రభుత్వానికి 40 సిఫార్సులు చేస్తే అందులో ఒక్క సిఫార్సు మాత్రమే అమలు చేసిందన్నారు.అది కూడా 1990 లో అమలు చేశారని,నేడు బీ సీ లకు 27 శాతం రిజర్వేషన్లు రావడం ఆయన పుణ్యమేన్నారు.కుల గణన జరిగితేనే బీసీ లకు న్యాయం జరుగుతుందని ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమన్నారు.మండల్ కమిషన్ లోని 40 సిఫార్సులను పూర్తిగా అమలులోకి తెచ్చి బీసీల సమగ్ర అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడినప్పుడే బీ పీ మండల్ కు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి విజయ్,జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్,కార్యదర్శి ములస్తం శివ ప్రసాద్, బీసీ సంక్షేమ మహిళా అధ్యక్షురాలు గంగం జలజ,సింగం పద్మ,విజయ,బక్కశెట్టి లక్ష్మీ,విద్యార్థి జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ధోనూరి భూమాచారి, యువజన,మహిళా,విద్యార్థి,ఉద్యోగ ,ఉపాధ్యాయ,పెన్షనర్స్ బీసీ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హడలెత్తిస్తున్న హైడ్రా...

(మొదటి పేజీ తరువాయి)

**- అసలు హైడ్రా అంటే ఏమిటి?**

హైడ్రా అనేది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన హైదరాబాద్ నగర పరిధిలోని చెరువులు కబ్జాకు గురికాకూడదనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారు. చెరువులపరిరక్షణ, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటైన హైడ్రా పరిధి ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్)వరకు ఉంటుంది. హైడ్రా ఛైర్మన్గా ముఖ్యమంత్రి వ్యవహరించనున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మంత్రులు, సీఎస్, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రెటరీ, జీహెచ్ఎంసీ మేయర్ సభ్యులుగా ఉంటారు.

**- హైడ్రా ఏం చేస్తుంది...**

హైడ్రా అంటే కేవలం కూల్చివేతలు మాత్రమే కాదు. సిటీని ప్రకృతి విపత్తుల నుంచి రక్షించడానికి కృషి చేయడం, విపత్తుల సమయంలో వేగంగా స్పందించి ప్రజలను కాపాడే సంస్థ.ప్రభుత్వ భూములను స్థానికులతో కలిసి కాపాడుకోవడానికి కృషి చేస్తూ... ప్రభుత్వ ఆస్తులైన చెరువులు,పార్కులు, నాలాలు, స్మశాన వాటికలు వంటి వాటిని కబ్జా కాకుండా చూస్తుంది. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించడం, విపత్కర పరిస్థితుల్లో నగరానికి అండగా ఉండటం దీని ప్రధాన లక్ష్యాలు.ఇప్పుడున్న చెరువులను కాపాడుతూ గతంలో బ్లాకు గురైన చెరువులను నెమ్మదిగా స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకుంటుంది. వీటి రక్షణ కోసమే హైడ్రా ఏర్పాటు చేయడం జరిగింది .భవిష్యత్తులో ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలంటే భయం పుట్టాలి. ఇది కబ్జాదారుల వెన్నులో వణుకు పుట్టిస్తుంది. ఇప్పటికే హైడ్రా అధికారులు ప్రభుత్వ భూములు,చెరువులు, పార్కులు, లేఅవుట్లలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, పరిశ్రమల శాఖకు చెందిన స్థలాల్లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు.

# యమధర్మరాజుకు ఘనంగా భరణి నక్షత్ర పూజలు

**- పూజా కార్యక్రమాలలో పాల్గొన్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**సూర్య ధర్మపురి:**



ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంనకు అనుబంధ దేవాలయమైన శ్రీ యమధర్మరాజు ఆలయంలో భరణి నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం స్వామి వారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్య సూక్తంతో అబిషేకం, ఆయుష్య హోమం, హారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు.అభిషేకం, ఆయుశ్య హోమం తదితర కార్యక్రమాలలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ప్రధాన ఆలయమైన శ్రీ యోగానంద నరసింహుని దర్శించుకున్న ఆయన అనుబంధ దేవాలయములను దర్శించుకున్నారు.అర్చకులు, వేదపండితుల ఆశీర్వదించగా దేవస్థానం పక్షాన ఈఓ సంకటాల శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు.

# వాటర్ కూలర్లను ప్రారంభించిన లక్ష్మణ్ కుమార్

భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఆవరణలో మహారాష్ట్ర కు చెందిన అజ్ఞాత భక్తుడు సమర్పించిన రెండు లక్షల విలువగల (రెండు వాటర్ కూలర్స్ ) 400 లీటర్ల కెపాసిటీ గల వాటిని లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగనబట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, సుముఖ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు దేవస్థాన సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, అర్చకులు నేరెళ్ల సంతోష్ కుమార్, నేరెళ్ల విజయ్, వొద్దిపర్తి కళ్యాణ్, అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్,సంపత్ కుమార్, రాజగోపాల్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

**సూర్య ధర్మపురి**



మనస్థాపంతో ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలంలోని కమలాపూర్ కు చెందిన సట్లంశెట్టి రజిని (37) శనివారం సాయంత్రం చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. రజని భర్త తిరుపతి చెడు వ్యసనాలకు బానిసై డబ్బులు లేక ఆమె మెడలోని పుస్తెలతాడు సైతం అమ్ముకున్నాడని తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన భర్తకు ఎన్నిసార్లు చెప్పినా ప్రవర్తనలో మార్పు రానందున తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. మృతురాలి మేనమామ పోతెం రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగుల మహేష్ తెలిపారు.

## హైడ్రా లాగా కరీంనగర్‌లో కాడ్రా ఏర్పాటుకు ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో కృషి చేస్తా

### - కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు

### - అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తాం - బీఆర్ఎస్ హయంలో యదేచ్ఛగా భూముల కబ్జా

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల సహకారంతో కరీంనగర్లో ప్రభుత్వ ప్రైవేటు భూముల పరిరక్షణకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్ తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో గత బీఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల ప్రభుత్వ, పేదల భూములు యదేచ్ఛగా కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రాలాగా కరీంనగర్లో ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులను కోరుతామని తెలిపారు.ఆదివారం వెలిచాల రాజేందర్ రావు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.కరీంనగర్, చుట్టుపక్కల గ్రామాల్లో బీఆర్ఎస్ హాయంలో గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా అయ్యాయని తెలిపారు. భూ కబ్జాదారులు, అక్రమ కట్టడాల నిర్మాణదారులు, ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిచ్చేలా చేస్తామని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గపు ఆలోచన చేసే వారి ఆట కట్టిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలతో కరీంనగర్ సిపి



అభిషేక్ మహంతి పేదల భూములను కబ్జా చేసిన కొంతమంది కార్పొరేటర్లు, నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సిపి అభిషేక్ మహంతి నిజాయితీగా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగే విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎల్ఎండి రిజర్వాయర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున జరిగాయని, రిజర్వాయర్లు అక్రమణాలు పెరిగాయని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన గత పాలకులు, నాయకులే దగ్గరుండి ప్రభుత్వ భూముల కబ్జా లో ప్రధాన పోషించడం దారుణమని మండిపడ్డారు. పేదల భూములను సైతం కబ్జా చేసి జలగల్లాగా పట్టిపీడించారని ఆరోపించారు. ప్రభుత్వం ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. హైడ్రాలాగా కరీంనగర్లో ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులను కలిసి విన్నవిస్తామని పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. హైడ్రాలాగా కరీంనగర్లో కాడ్రా వ్యవస్థను వివిధ శాఖల అధికారులతో పాటు పోలీసు అధికారులతో కలిసి ఒక అథారిటీని ఏర్పాటు చేసేలా చూస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములు కబ్జా చేయాలంటే అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టేలా చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్లో పేదల భూములను లాక్కున్న వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని, పేదలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. చెరువులు, కుంటలు, కాలువల కబ్జాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని చెప్పారు. అక్రమ నిర్మాణాలు భూముల కబ్జాపై ఉక్కు పాదం మోపుతూ ఇకముందు కబ్జాలు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని తెలిపారు. పేదలు ఎలాంటి ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగాలో ఛాంపియన్ గా నిలవాలి

### - జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్ సింగ్ - ముగిసిన జిల్లాస్థాయి యోగాసన క్రీడా పోటీలు

**03 సూర్య కరీంనగర్ ప్రతినిధి**

హైదరాబాద్ లో లో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలో చాంపియన్‌షిప్ సాధించి కరీంనగర్ జిల్లా కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. కరీంనగర్ జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో గత రెండు రోజుల పాటు జరుగుతున్న జిల్లాస్థాయి యోగాసన క్రీడా పోటీలు ఆదివారంతో ముగిసాయి. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలో జాతీయస్థాయి యోగా పోటీలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, జాతీయ పోటీల నిర్వహణ బాధ్యతలను కరీంనగర్ కు వచ్చే విధంగా చూడాలని రాష్ట్ర సంఘాన్ని కోరారు. ప్రస్తుత కాలంలో యోగను ప్రతి ఒక్కరు దినచర్యగా సాధన చేయాలన్నారు. నేడు యోగాను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒక క్రీడగా గుర్తించాయన్నారు.




ఎందరో యోగా క్రీడాకారులు స్పోర్ట్స్ సర్టిఫికేట్లతో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. కరీంనగర్ జిల్లా ఈసారి కూడా ఛాంపియన్షిప్ సాధించాలని ఆకాంక్షించారు. గతంలో కరీంనగర్ జిల్లా వరుసగా చాంపియన్ షిప్‌లను కైవసం చేసుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. జిల్లాస్థాయి యోగా పోటీలు ప్రశాంతమైన వాతావరణంలో దిగ్విజయంగా జరిగాయని జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ కొనియాడారు. ఏలాంటి ఆటు పోటులు లేకుండా నిర్వహించిన యోగా సంఘం భాద్యులను, రెఫరీలను ఈ సందర్భంగా ఆయన అభినంధించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు అద్వితీయ ప్రతిభను కనబరిచారని ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి యోగా కోచ్‌లు వి.కిష్టయ్య రామకృష్ణ, మల్లేశ్వరి, స్వరూప, చారి, ఆనంద్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. 8 సంవత్సరాల వయస్సు విభాగం నుంచి 45 సంవత్సరాల వయస్సు పైబడిన 10 విభాగాల్లో బాలబాలికలకు, పురుషులకు, మహిళలకు వేరు వేరుగా పోటీలను నిర్వహించగా ప్రతి విభాగం నుండి 5 చొప్పున అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 50 మంది క్రీడాకారులను జిల్లాకు ఎంపిక చేయడం జరిగింది. మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్న క్రీడాకారులకు మెడల్స్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్స్, పాల్గొన్న క్రీడాకారులందరికి సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగింది. వీరిని ఈనెల 31న, సెప్టెంబర్ 1న సరూర్ నగర్లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బీపీ మండల్ జయంతి

**సూర్య కరీంనగర్ టౌన్**


బీసీ రిజ్వేషన్ల పితామహుడు బీపి మండల్ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కరీంనగర్ లోని బీసీ సంఘం కార్యాలయం లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన బీపీ మండల్ 106 వ జయంతి కార్యక్రమం లో వారు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడుతూ ఇప్పుడు ఓబీసీలు విద్యా ఉద్యోగం లో అనుభవిస్తున్న 27 శాతం రిజర్వేషన్లు బీపీ మండల్ చేసిన సిఫార్సు వలన



అని తెలిపారు.వెనుకబడిన తరగతుల స్ఫూర్తి ప్రదాత బిందేశ్వరి ప్రసాద్ మండల్ అని కొనియాడారు.బీసీ లు ఎదుర్కొంటున్న వివక్షను ప్రశ్నించి ముఖ్యమంత్రి పదవిని వదులుకున్న బీసీ పక్షపాతి అని తెలిపారు. రెండవ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడిగా బీసీ లకు 27శాతం రిజర్వేషన్లు సాధించిన గొప్ప మానవతావాది అని తెలిపారు.కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీ జనగణన చేసినప్పుడే ఆ మహనీయునికి నిజమైన నివాళి అర్పించనట్లు అవుతుందని తెలిపారు. బీపి మండల్ జయంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు , రాష్ట్ర కార్యదర్శి గాజే రమేష్ , బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, గాజే ప్రజ్యోత్, దుప్పటపల్లి మురళి , బియ్యని తిరుపతి బండారి మల్లయ్య, నలివెల్ రవి,తదితరులు పాల్గొన్నారు.

## 9,10వ డివిజన్‌ల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాల్ల నియామకం

**సూర్య కరీంనగర్ టౌన్**



కరీంనగర్ పట్టణ పరిధిలోని కోతి రాంపూర్ 9వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా అల్లం కనకలక్ష్మిని, 10వ డివిజన్ అధ్యక్షురాలుగా బూర్ల అంజలిని నియ మిస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నా రెడ్డి జారీచేసిన నియామక పత్రాలను ఆయా డివిజన్లకు చెంది పలువురు మహిళా నేతల సమక్షంలో మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్ పడిశెట్టి భూమయ్య, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని చంద్రయ్య గౌడ్ అందజేయడం జరి గింది. తన నియామకానికి సహకరించిన జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి, మానకొండూరు ఎమ్మెల్యే కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకి, జిల్లా కాంగ్రెస్ నాయకత్వానికి నూతనంగా నియమితులైన మహిళా నేతలు కృత జ్ఞతలు తెలియజేయడంతోపాటు తనకు అప్పగించిన ఈ బాధ్యత పట్ల పూర్తి విశ్వాసం విధేయత చూపుతానని తెలిపినారు.

## వేడుకగా ఓవెల్స్ స్కూల్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు


**సూర్య కరీంనగర్ టౌన్**




శ్రీరాంనగర్ కాలనీ, విద్యానగర్, కరీంనగర్‌లో ఓవెల్స్ స్కూల్‌లో శ్రీ కృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆనందోత్సహాలతో నిర్వహించడం జరిగింది. పాఠశాల చిన్నారులు కృష్ణ, గోపికల వేషధారణలో హాజరయి జన్మాష్టమి వేడుకలను ఆట పాటలతో కన్నుల పండుగగా నిర్వహించారు. చిన్నారులు ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, కరెస్పాండెంట్ జె. తిరుపతి రెడ్డి, అన్ని తరగతుల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**సూర్య కరీంనగర్ టౌన్**



45 డివిజన్ కు చెందిన దండు వరలక్ష్మి 100 మంది మహిళలు, యువకులు పురుమల్ల శ్రీనివాస్, దండు మధు ఆధ్వర్యంలో కాంగ్రెసులో చేరినారు.

## మంత్రాలు, తాయత్తుల పేరుతో మోసం చేస్తున్న వారిపై కేసు నమోదు

**సూర్య, వీణవంక**

వీణవంక మండలం హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్ రెడ్డి తో పాటు మరో ఇద్దరిని వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలోని ఆర్ఆర్ కాలనీకి చెందిన బెడ బుడగ జంగం కులస్తులైన పైత్యం బాల రాజు, గంధం రాజు, పైత్యం చందు లు ఇటీవల పై ముగ్గురు శ్రీనివాస్ రెడ్డిని నీకు.....నీ ఇంటికి శని పట్టిందని, శని దోషం పోవాలంటే మేము పూజలు చేసి పోగొడ్తామని, లేదంటే నీవు చనిపోతానని భయభ్రాంతులకు గురి చేసి బలవంతంగా నా వద్ద 9 వేలు, మరో ఇద్దరి వద్ద 11 వేలు తీసుకొని వెళ్ళిన ముగ్గురిపై బాధితుడు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి ఆదివారం తెలిపారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

పెద్దపల్లి
సోమవారం 26 ఆగష్టు 2024



## గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురండి

**- ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందేలా చూడండి**

**- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**సూర్య-గోదావరిఖని**


రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాల పరిధిలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఇక్కడి తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమైన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాల పై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనేక గ్రామాలు ఎన్నో ఏండ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక కార్యచరణ తో ముందుకు వెళ్లాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందేలా చూడాలని, అంతర్గాం పాలకుర్తి మండలాల పాఠశాలల అభివృద్ధి కోసం రెండు



కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలని, పచ్చదనం, పరిశుభ్రత కు అధిక ప్రాధాన్యత నివ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో నెలకొని ఉన్న ప్రతి సమస్యను లిఖితపూర్వకంగా తీసుకువచ్చి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తీసుకువస్తామని, సింగరేణి సంస్థ సహకారంతో సోలార్ దీపాలు గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం సింగరేణి సంస్థకు చెందిన రామగుండం ఏరియా-1, 2 జిఎంలు, ఇతర అధికారులు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తన కార్యాలయంలో జూమ్ మీటింగ్ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, జిఎం లు లలిత్ కుమార్, సూర్యనారాయణ, పలువురు అధికారులతో ఎమ్మెల్యే జూమ్ మీటింగ్ లో మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, మున్సిపల్ అధికారులు టెండర్ అయిన పనులను సంబంధిత కాంట్రాక్టర్లతో వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ముస్లిం మైనార్టీలకు చెందిన కబరస్థాన్ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని, సింగరేణి కార్మిక వాడల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అర్హులైన వారి జాబితా సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశించారు.

## బిపి మండల్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

**సూర్య-పెద్దపల్లి టౌన్**



దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిపి మండల్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, యువత విభాగం జిల్లా అధ్యక్షులు అట్ల సాగర్ యాదవ్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఆదివారం బిపి మండల్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బిసిల ఆరాధ్య దైవంగా నిలిచిన బిపి మండల్ కు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. మండల్ కమిషన్ సిఫారసు మేరకే బిసిలకు 27 శాతం రిజర్వేషన్లు దక్కాయని గుర్తు చేశారు. బిపి మండల్ ఆశయాలను బీసీలు కొనసాగించాలని, ఓబీసీ రిజర్వేషన్ల పెంపుకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదవ నాయకులు మల్లెత్తుల నాగరాజు, సలేంద్ర రాములు, దాడి చంద్రమొగిలి, బత్తుల లింగయ్య, వేల్పుల చంద్రకుమార్, రేషవేన సురేష్, చెలుకల వెంకటేష్, నర్ల సాయి, వేల్పుల శ్రీనివాస్, పోలం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

**- పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రజిత**

**సూర్య సెంటినరీ కాలనీ**



ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రజిత అన్నారు. సెంటనరీ కాలనీ లో (ఐఎఫ్ టియు) కార్యాలయంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర 7వ మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రజిత మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, హత్యాకాండలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ముఖ్యంగా పసిపాపల పైన ఆదివాసి .దళిత, గిరిజన,బలహీన వర్గాల మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోక పోవడం వలన తిరిగి పునరవతమవుతున్నాయని అన్నారు. మహిళలపై వివక్షత దాడులకు, దౌర్జన్యాలకు, హత్యలకు వ్యతిరేకంగా పురుష సమానత్వం కై మహిళలందరూ ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.పద్మ, ఈ.లక్ష్మి, సావిత్రి, డి.భాగ్య, తిరుమల, రాణీ, పుట్ట లక్ష్మి, పాల్గొన్నారు.

## పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా నలుమాచు ప్రభాకర్

**సూర్య మంథని**



పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా మంథని పట్టణానికి చెందిన నలుమాచు ప్రభాకర్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘంలో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంథని పట్టణానికి చెందిన ప్రభాకర్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ప్రముఖ న్యాయవాది, పెద్దపెల్లి జిల్లా మున్నూరు కాపు మహాసభ జిల్లా కన్వీనర్ ఇనుముల సతీష్, కాంగ్రెస్ నాయకులు రావికంటి సతీష్, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్ బాబుకు ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ప్రత్యేక అధికారులు గ్రామాల పైన శ్రద్ధ వహించాలి

**సూర్య మంథని రూరల్**



మంథని మండలంలోని పలు గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన కొరవడిందని, ప్రత్యేక అధికారులు గ్రామాల పైన శ్రద్ధ వహించాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పోతరవేణి క్రాంతి కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాలలో ప్రజలు అనేక వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని గ్రామాలలో ప్రజలను పట్టించుకునే నాధుడే కరువయ్యారని అన్నారు. జిల్లావ్యాప్తంగా జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించడం లేదని,సీజన్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించడం లేదన్నారు.పీహెచ్సీలలో సిబ్బంది కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆసుపత్రిలలో సరిపడే సిబ్బందిని నియమించాలని వారు డిమాండ్ చేశారు.ప్రత్యేక అధికారులు వెంటనే చొరవ తీసుకొని ప్రజలను రోగాల బారిన పడకుండా వైద్య సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని ఆయన పేర్కొన్నారు.

## సింగరేణి సిఎండి కలిసిన లల్లు

**సూర్య కమాన్‌పూర్**



కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, యువజన కాంగ్రెస్ డివిజన్ యువ నాయకుడు యూసుఫ్ లల్లు శనివారం సింగరేణి సిఎండి బలరాం నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.

## కుక్కల దాడిలో గాయపడ్డ దుప్పి

**- ఫారెస్ట్ అధికారులకు అప్పగించిన ఎరుకల రవి**

**సూర్య మంథని రూరల్**

మంథని మండలం గోపాల్ పూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో లభ్యమైన దుప్పిని ఫారెస్ట్ అధికారి ప్రదీప్ కు అప్పగించారు.ఆదివారం గోపాల్పూర్ శివారు అటవీ ప్రాంతంలో దుప్పిని గ్రామ కుక్కలు వెంబడించి వేటాడుతుండగా ఆ ప్రాంతంలో ఉన్న గ్రామస్తులు ఎరుకల రవితోపాటు చంద్రుబాలు వెంటబడిన కుక్కల భారినుంచి గాయపడ్డ దుప్పిని కాపాడి ఫారెస్ట్ అధికారి ప్రదీప్‌కు దుప్పిని సురక్షితంగా అప్పగించారు.



## బీజేపీ ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా రాజేంద్ర ప్రసాద్

**సూర్య-పెద్దపల్లి టౌన్**



బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా మంథని నియోజక వర్గానికి చెందిన పూసాల రాజేంద్రప్రసాద్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ తెలిపారు. ఈమేరకు ఆదివారం రాజేంద్రప్రసాద్‌కు నియామక పత్రం అందజేశారు. తన నియమాకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డికి రాజేంద్రప్రసాద్ ధన్యవాదములు తెలిపారు. ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేస్తూ, బీసీ కులాలను చైతన్య పరుస్తానని తెలిపారు. తన నియమాకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన ప్రియుడు

**- ప్రియుని ఇంటి ముందు బైటాంచిన ప్రియురాలు.**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన ప్రియుడి ఇంటి ముందు బైఠాయించిన యువతి సంఘటన మండలంలోని పెద్దంపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే ఆ గ్రామానికి చెందిన ఓ యువతి అదే గ్రామానికి చెందిన యువకుడు గత నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇటీవల యువతికి తన మేనమామ పెళ్లి సంబంధాలు చూశాడు. ఈ విషయాన్ని యువతి తను గ్రామానికి చెందిన ఓ యువకుని ప్రేమించినట్లు తెలిపింది. యువతి తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి ఇంట్లో వాళ్లకు చెప్పి పెళ్లి చేసుకుంటానని. స్నేహితులను 50వేల రూపాయలు అడిగానని చెప్పాడు. ఇంతలోనే ఏమైందో తెలియదు నిన్ను పెళ్లి చేసుకుంటే మా అమ్మానాన్నలు పురుగుల మందు తాగి చస్తారంట అని బ్లాక్ మెయిల్ చేసి ఇంటి నుండి పారిపోయాడు. విషయం తెలుసుకున్న యువతి ప్రియుడి ఇంటి ముందు బైఠాయించి నిరసన చేపట్టింది. యువకుని తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. తనకు న్యాయం చేయాలని యువతి వేడుకుంటుంది సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ నీలిమ యువతకి న్యాయం చేస్తామని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు పోలీసులు తన బిడ్డకు న్యాయం చేయాలని తల్లి వేడుకుంటుంది.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**సూర్య వీణవంక**

మానకొండూరు మండలం ఊటూరు గ్రామానికి చెందిన సింగారపు రాజలింగు మానేరు వాగు నుండి తన ట్రాక్టర్ టిఎస్ 19 టి 1521/8803 నంబర్ గల దానిలో అక్రమంగా ఇసుకను తీసుకొని వీణవంక మండలంలోని మామిడాల పల్లి గ్రామానికి చేరుకొనే సరికి అటు గస్తికి వెళ్ళిన పోలీసులకు ఎదురు కావడంతో డ్రైవర్ సింగారపు వేణు ప్రసాద్‌ను ఎలాంటి అనుమతులున్నాయని విచారించగా లేవని చెప్పడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ కు తరలించి ట్రాక్టర్ తో పాటు యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

# ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా బిజెపికి గుర్తింపు

## - సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## - బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జోన్ ఇన్చార్జి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి

సూర్య కరీంనగర్ ప్రతినిధి



ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా బిజెపికి గుర్తింపు లభించిందని, గతంలో చైనా కమ్యూనిస్టు పార్టీకి ఆ ఖ్యాతి ఉండేదని ,2014 తర్వాత దాన్ని వెనక్కి నెట్టిందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ జోన్ ఇన్చార్జి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్లో బిజెపి జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో తదనంతరం రేకుర్తిలోని సాయి మహాలక్ష్మి గార్డెన్లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యాశాల ప్రోగ్రాం సమావేశంలో గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి అవతరించడానికి ప్రధాన కారణం క్యాడరేనని, బిజెపి క్యాడర్ బేస్డ్ పార్టీ అని , వ్యక్తుల కోసం కాకుండా దేశం కోసం పనిచేసే పార్టీ అని అన్నారు.2014 లో పార్టీలో సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ జరిగిందని, పదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు దేశవ్యాప్తంగా జరుగుతుం దన్నారు.పార్టీ కొత్త సభ్యత్వ నమోదు లో పార్టీ నేషనల్ చీఫ్ మొదలుకొని పోలింగ్ బూత్ స్థాయి వరకు ప్రస్తుతం కొనసాగుతున్న సభ్యులంతా పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకుంటారన్నారు. అలాగే సన్నాక సమావేశాలు, వర్క్ షాపులు నిర్వహించి పోలింగ్ బూత్ స్థాయి నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. సభ్యత్వ నమోదు తో పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని , ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు కోసం తగిన కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై, పదేళ్లు రాష్ట్రాన్ని ఏలిన బిఆర్ఎస్ లు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయన్నారు. గత బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తుందన్నారు. నాటి టిఆర్ఎస్ బంగారు తెలంగాణ .. నేటి కాంగ్రెస్ ప్రజా పాలన అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. నాటి బీఆర్ఎస్ కుటుంబ స్వార్థం పాకులాడిందన్నారు. కాంగ్రెస్ అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలను, రైతులను తీవ్రంగా మోసం మోసం చేసిందన్నారు. ప్రజల దృష్టిలో ఈ రెండు పార్టీల పట్ల బోగస్ , మోసం అనే భావన ఏర్పడిందన్నారు. అందుకే ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని ,దేశంలోనే కాదు తెలంగాణలో కూడా బిజెపి అధికారంలోకి రావాలని బలంగా ఆకాంక్షిస్తూ న్నారని తెలిపారు. జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ఓటింగ్ శాతం బలంగా పెరిగిందన్నారు. ఎన్నికలు ఏవైనా బూత్ స్థాయిలో విజయం సాధించాలంటే సభ్యత్వం కీలకమన్నారు. అందుకోసమే జరగబోయే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు భాస సత్యనారాయణ రావు ,మాజీ మేయర్ డి శంకర్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ తదితరులు మాట్లాడారు. కరీంనగర్ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్చార్జి , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఈ సందర్భంగా సభ్యత్వానికి సంబంధించిన పలు విషయాలపై బిజెపి శ్రేణులకు మార్గ నిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కొరటాల శివరామయ్య ,ఈనుకొండ నాగేశ్వర్ రెడ్డి, గుగ్గిల్లపు రమేశ్ సీనియర్ నాయకులు బాస సత్య నారాయణ,మాజీ మేయర్ డి శంకర్ వాసాల రమేశ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్ ,బత్తుల లక్ష్మి నారాయణ ,మాడ వెంకట్ రెడ్డి, కరీం నగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, సభ్యత్వ నమోదు కో కన్వీనర్స్ జాడీ బాల్ రెడ్డి , గుర్రాల నిర్మలా దేవీ ,నరసింహ రాజు, బిజేపిజిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, కళ్లెం వాసుదేవా రెడ్డి ,ఎర్రవెల్లి సంపత్ రావు ,కన్న కృష్ణ ,రంగు భాస్కరాచారి ,కార్పొరేటర్లు బండా సుమ ,చొప్పరి జయశ్రీ ,కొలగాని శ్రీనివాస్ ,పవన్, శ్రీనివాస్, బిజేపి జిల్లా పదాధికారులు,అసెంబ్లీ కన్వీనర్ లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ,మండల అధ్యక్షులు ,ప్రధాన కార్యదర్శులు , సభ్యత్వ మండల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు

# ఉత్కంఠగా కొనసాగిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

## - రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సూర్య కరీంనగర్ ప్రతినిధి



సైక్లింగ్ చేయడం వలన చాలా ఆరోగ్యంగా ఉంటామని, కార్యకలాపాలను ఎటువంటి ఆటంకం లేకుండా చేపట్టవచ్చని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు.డా.బి.మధుసూదన్ రెడి, అధ్యక్షులు, సైక్లింగ్ జిల్లా అసోసియేషన్, జిల్లా భాద్యులతో కలిసి స్థానిక వెలిచాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసినటువంటి జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలకు, రాష్ట్ర స్థాయి పోటీల ఎంపికకు ముఖ్య అతిథిగా హాజరైనారు. అనంతరం వారు వివిధ విభాగాల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీలు చాలా ఉత్సహంగా కొనసాగయని, క్రీడాకారులు ఒకరిఒకరు పోటి పడి చాలా రసవంతరంగా కొనసాగించారని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుండి విచ్చేసిన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి అద్భుతంగా రాణించారని తెలుపుతూ గతం కంటే ఇప్పుడు క్రీడాకారులు చాలా శిక్షణ పొంది మంచి అనుభవంతో చాలా ఉన్నతంగా రాణించారని తెలుపుతూ కరీంనగర్ జిల్లా సంఘం రాష్ట్ర స్థాయి పోటీలను ఇది వరకే రెండు సార్లు పోటీలను నిర్వహించి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. అదే స్ఫూర్తిని నేడు కూడా తరగని ఉత్సహంతో చాలా గొప్పగా అవిష్కరించామని తెలిపారు .క్రీడాకారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేడు చాలా మంది సైక్లింగ్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని చెప్పారు. కోచ్లు, భాద్యులు, చిట్కాలను తెలుసుకొని వారు కూడా సైక్లింగ్ను రోజు వారి ప్రక్రియలా కొనసాగిస్తారని చెప్పారు. సంఘం వారి ఆధ్వర్యంలో చాలా అద్భుతమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ ఇతర సంఘాలకు ధీటుగా నిలుస్తున్నామని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు.రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారి వివరాలు: అండర్-14 బాలురు: వి.గౌతమ్, ఎం. నాగసాయి, వి.నేహార్, కె. అనిరూద్, పి.శ్రేష్ మరియు బి. అక్షయ్అండర్-16 బాలురు: ఎస్.ఆర్. లికిల్ అనిష్అండర్-18 బాలురు: వి. హృతికేష్, బి. నిషద్జ మరియు జె. సంజన్అదిత్య 23 పైగా పురుషులు: వి. వేణుగోపాల్, రెహన్, కోటేశ్వర్ రావు, అఖిల్, సి.అశోక్ కూమార్ గెలుపొంది, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా బహుమతులను ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా కార్యక్రమం జయప్రదం అవడానికి సహకరించిన కరీంనగర్ పోలీస్ కమీషనరేట్, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పోటీలలో సుమారు 150 వివిధ విభాగాలలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని నింపారు.ఈ కార్యక్రమంలో జిల్లా భాధ్యులు ఎన్. వేణుగోపాల్, ఇనుగుర్తి రమేష్, అరవింద్ బాబు, ఆన్వేష్, కరీంనగర్ జిల్లా టీం మేనేజర్లు, కోచ్లు, ప్రతినిధులు, వ్యాయమ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# అక్రమ కట్టడాల కూల్చివేత హర్షనీయం

## - ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

సూర్య జగిత్యాల



రాష్ట్రంలో అక్రమ కట్టడాల కూల్చివేత నిర్ణయం హర్షనీయమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్ లో ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఅసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేరువులపైన నిర్మించిన అక్రమ కట్టడాలపై ఇతర అక్రమ కట్టడాలపై ఏ విధంగా ముందుకు వెళ్లలి అని ఒక అంశాన్ని ప్రవేశ పెట్టారన్నారు. దీని పైన అధికార పార్టీ సభ్యులు ప్రతిపక్ష సభ్యులు చర్చించడం జరిగిందన్నారు. చెరువుల పైన,బఫర్ జోన్ లో నిర్మించిన అక్రమ కట్టడాల నిర్మాణాల కూల్చివేత చేపట్టలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలు హర్షిస్తున్నారన్నారు. హైదరాబాద్ లోని నక్లెస్ రోడ్డు లో ఉన్న అక్రమ కట్టడాలను, జిల్లాలలో కూడా ఉన్న అక్రమ కట్టడాలను జిల్లా కలెక్టర్,ఎస్పీల అద్వర్యంలో కూల్చివేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని సిఎంను కోరుతున్నామన్నారు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే శాసన సభ్యులతో చర్చిన తర్వాత వారి ఆమోదంతోనే తీసుకుంటుంది.అంతే గాని వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకోదని, దీని పైన ప్రతిపక్షాలు ప్రభుత్వం పైన బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయి,వాటిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, నాయకులు బండ శంకర్, గాజుల రాజేందర్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# మినీ స్టేడియం అభివృద్ధికి కృషి

## - ఎమ్మెల్యే విజయ రమణారావు

సూర్య సుల్తానాబాద్



కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడా రంగాన్ని అభివృద్ధి పరుస్తామని, పట్టణంలోని మిని స్టేడియం మరమ్మతులకు తాత్కాలిక నిధులు కేటాయిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీ లో గల మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఖోఖో శిబిరాన్ని ఎమ్మెల్యే ఆదివారం సందర్శించారు. స్టేడియంలో ఖోఖో ఆటను తిలకించిన ఎమ్మెల్యే క్రీడాకారులకు టీ షర్టులు, క్రీడా సామాగ్రిని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ గత మూడు, నాలుగు దశాబ్దాలుగా సుల్తానాబాద్ పట్టణం క్రీడలకు పుట్టినిల్లు అయిన సుల్తానాబాద్ నుండి పలువురు క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దశ దిశల సుల్తానాబాద్ ఖ్యాతిని పెంచారని గుర్తు చేశారు. మినీ స్టేడియం నిర్వహణకు, స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని, తాత్కాలిక మరమ్మతుల కోసం 3 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు క్రీడాకారుల హర్షద్వానాల మధ్య ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రకటించారు. ఫుట్ బాల్ క్రీడాకారుడైన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారని, ఆసియా, కామన్వెల్ గేమ్స్ లో తెలంగాణ సత్తా చాటేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించిందని, గ్రామీణ క్రీడల పట్ల క్రీడాకారులు ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సురేష్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కాంగ్రెస్ నాయకులు డి.రాజయ్య, చింతల రాజు, వేగోలం అబ్బయ్య గౌడ్, అమిరిశెట్టి రాజలింగం, కుమార్ కిషోర్, గరిగే శ్రీనివాస్, ఖేలో ఇండియా క్రీడాకారుడు గెల్లు మధుకర్, పీఇటిలు డి.రమేష్, దాసరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఇస్తామన్నాడు - సెస్ చైర్మన్ ఇవ్వనన్నారు

**- పవర్లూమ్‌లకు విద్యుత్ సబ్సిడీ విషయంలో ఎటు తేలని వ్యవహారం - 20 హెచ్పిల వరకు సబ్సిడీ కొనసాగించాలని పరిశ్రమ వర్గాల డిమాండ్**

**- ఫోన్లో సెస్ చైర్మన్ తో మాట్లాడిన విప్ ఆది శ్రీనివాస్ - కోర్టులో కేసు ఉండడంతో 10 హెచ్పి లకు మించి కుదరదని స్పష్టం చేసిన సెస్ అధికారులు**

**- ఫోన్లో కాదు,జీవో ఇప్పించాలన్న సిరిసిల్ల సెస్ డైరెక్టర్ - ఉపాధి లేక అగమ్యగోచరంలో ఆసాములు**


**- విద్యుత్ సబ్సిడీ వర్తింపజేస్తేనే ఉపాధి దొరుకుతుందన్న పరిశ్రమ వర్గాలు**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

దేవుడు కరుణించినా పూజారి అడ్డుకున్న చందంగా తయారయింది సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమ విద్యుత్ సబ్సిడీ వ్యవహారం.ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సిరిసిల్లలోని మరమగ్గాలకు నాలుగు మీటర్ల వరకు విద్యుత్ సబ్సిడీ ఇస్తామని చెప్పినా, సెస్ చైర్మన్ మాత్రం ఇవ్వనంటున్నాడని ఆసాములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సిరిసిల్ల పట్టణం లోని పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ గత ఎనిమిది నెలలుగా తీవ్ర సంక్షోభంలో కూరుకపోయిన విషయం తెలిసిందే. ఒకవైపు ప్రభుత్వం నుంచి గతంలో కొనసాగిన బతుకమ్మ చీరల ఆర్డర్ నిలిచిపోవడంతో ఉపాధి కరువై మరముగాలు మూగపోయాయి. మరోవైపు 10 హెచ్పిల వరకు మాత్రమే సబ్సిడీ అందిస్తామని సెస్ అధికారులు భీష్మంచుకోవడంతో ప్రైవేటు ఆర్డర్లను కూడా ఉత్పత్తి చేయలేక పరిశ్రమ వర్గాలు వ్యాపారాలను నిలిపివేశారు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని పవర్లూమ్ కార్మికులు, ఆసాములు ఆర్థికంగా చితికి పోతున్నారు. మరమాగ్గాలపై పనిచేసే కార్మికుల పరిస్థితి అయితే దయనీయంగా తయారయింది. అప్పులు కట్టలేక,చేయడానికి పని లేక ఇప్పటికే పలువురు నేతన్నలు ఆత్మహత్యల బాట పట్టిన విషయం తెలిసిందే.ఈ కోవలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌లు నేత కార్మికులకు



ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పలుమార్లు ప్రకటించి భరోసా కల్పించారు. అయితే ఇప్పటివరకు ఒక్క ఆర్వీఎం వస్త్రాల ఆర్డర్ మినహా మరే కొత్త ప్రభుత్వ ఆర్డర్లు నేత కార్మికులకు అందలేదు. కనీసం ప్రభుత్వంలో ఉన్న పెద్దలు గతంలోలా పవర్ సబ్సిడీని కొనసాగిస్తే నైనా ఎంతో కొంత వస్త్ర పరిశ్రమ ముందుకు వెళ్లే అవకాశం ఉండేది.సమస్యపై పలుసార్లు ప్రభుత్వ పెద్దల వరకు వద్దకు వెళ్లిన ఆసాములకు భరోసా దొరికినా, వాస్తవంలో మాత్రం పవర్ సబ్సిడీ కొనసాగడం లేదు. ఇదే సమస్యపై గత శనివారం పవర్ సబ్సిడీ అందించాలంటూ ఆసాములు సిరిసిల్ల పట్టణంలోని సెస్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆసాముల సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 20 హెచ్పిల వరకు ఉన్న విద్యుత్తు కనెక్షన్లకు సబ్సిడీ కొనసాగిస్తామని చెప్పడంతో పాటు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో కూడా తమ ముందే ఫోన్లో మాట్లాడారని తెలిపారు. ఆది శ్రీనివాస్‌తో 20 హెచ్పి ల వరకు సబ్సిడీతో బిల్లులను అందించేందుకు ఫోన్లో అంగీకరించిన చైర్మన్ సిరిసిల్ల వచ్చి మాట్లాడితే మాత్రం పది హెచ్పీలకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీ అందించడం కుదరదని తెగేసి చెప్పారని వాపోయారు. కోర్టులో కేసు ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లో నాలుగు మీటర్లు అంటే 20 హెచ్పిల వరకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వడం కుదరదని సెస్ చైర్మన్ తో పాటు ఎండి స్పష్టం చేశారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫోన్లో మాట్లాడడం కాదని,సీఎంతో జీవో ఇప్పించాలని సిరిసిల్ల పట్టణ సెస్ డైరెక్టర్ స్పష్టం చేశాడని వారు వెల్లడించారు. పరిశ్రమ మునగడ కోసం ఉపాధి కోసం తాము కాళ్ళు అరిగేలా ప్రభుత్వ పెద్దల చెట్టు,అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ లాభం ఉండటం లేదని ఆసాములు వాపోయారు. విద్యుత్ సబ్సిడీ గతంలోలా కొనసాగించకపోతే వస్త్ర వ్యాపారం చేయడం కుదరదని ఆసాములు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ పెద్దలు కల్పించుకొని సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



## కుంగ్ ఫు పోటీల్లో బచ్పన్ స్కూల్ విద్యార్థులు

**సూర్య వేములవాడ**






కరీంనగర్ రెవిన్యూ గార్డెన్ లో ఆదివారం నిర్వహించిన కుంగ్ ఫు కరాటే పోటీలో వేములవాడ బచ్పన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు.విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

## శ్రీ నవదుర్గా సేవా సమితి నూతన కార్యవర్గం ఏర్పాటు

**సూర్య, రాయికల్**

రాయికల్ పట్టణంలోని మార్కండేయనగర్ శ్రీ నవదుర్గా సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గంట్యాల ప్రవీణ్,ప్రధాన కార్యదర్శిగా మోర చైతన్య, ఉపాధ్యక్షులుగా జోపువార్ మధు, శ్రీరాముల సాయికిరణ్,సంయుక్త కార్యదర్శులుగా బూర్ల గోపి ,మానాల రాము,కోశాధికారి సంగ రాము,సంయుక్త కోశాధికారులుగా అంకం శ్రీకర్, అనుమల్ల సాయి,ప్రచార కార్యదర్శిగా బొమ్మకంటి నవీన్ కుమార్,సంయుక్త ప్రచారకార్యదర్శులుగాలి మ్యాకల భాను,భీమనతి రాహుల్ ,గట్టు నవీన్, సూతహరి విజయ్ కుమార్, సుంటిగీకర్ భరత్, బూర్ల గణేష్ ,నరంశెట్టి మనోజ్ ,పెరుమల్ల శేఖర్, గౌరవ సలహాదారుగా ముంజ సుజిత్,గొల్లవత్తిని భరత్,గట్టు వినయ్,సాంబారు రంజిత్,రాచకొండ సురేష్,చిట్యాల భూమేష్ లు ఎన్నికయ్యారు.

## అనుమతులు లేకుండా జోరుగా అక్రమ ఇసుక రవాణా

**- అరికట్టడంలో అధికారులు విఫలం**

**సూర్య రుద్రంగి**




రుద్రంగి మండల కేంద్రంలో అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జోరుగా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడం, అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో ఏపీ 23 ఎఫ్ 49 35 నెంబర్ గల ట్రాక్టర్ తో ఇసుక రవాణా యదేచ్చగా చేస్తున్నారు. అసలే వర్షాకాలం అందులో ఇసుక ట్రాక్టర్లు నడుస్తూ ఉండడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, కొన్ని సందర్భాలలో మైనర్లు అతివేగంతో ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు అక్రమ ఇసుక రవాణా పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై రుద్రంగి ఎస్ఐ సిరిసిల్ల అశోక్‌ని వివరణ కోరగా సంబంధిత శాఖల అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇదే విషయంపై తహసిల్దార్ శ్రీలతను వివరణ కోరగా ఆదివారం రోజున ఎలాంటి పర్మిషన్లు ఇవ్వడం జరగలేదని పర్మిషన్ లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు.

### నేత్రపర్వంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**సూర్య సిరిసిల్ల టౌన్**



అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘము ఆధ్వర్యంలో సిరిసిల్ల ఇస్కాన్ సెంటర్ సహకారంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సిరిసిల్లలో అత్యంత వైభవంగా కన్నుల పండుగ నిర్వహించారు.సిరిసిల్ల ఇస్కాన్ సెంటర్ ఆధ్వర్యంలో పద్మనాయక కల్యాణ మండపంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి.ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.ఆదివారం రోజున ఉదయం నుంచి శ్రీకృష్ణ పరమాత్మునికి అభిషేకాలు నిర్వహించారు.రాధాకృష్ణులకు అభిషేకము,దర్శన హారతి,గురుపూజకు వచ్చిన భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.అనంతరం హరినామ జప యజ్ఞం,ఉయ్యాల సేవ నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరాగా పద్మనాయక ప్రాంగణం హరే కృష్ణ ఉచ్చరణతో మార్మోగింది.శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.సుమారు ఈ కార్యక్రమానికి 3,000 మంది భక్తులు విధిగా హాజరై ఆ శ్రీకృష్ణ పరమాత్ముని సేవలో తరించారు.సిరిసిల్ల పట్టణం నుండే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి శ్రీకృష్ణ పరమాత్మని దర్శించుకున్నారు.సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఇట్టి దైవ కార్యక్రమం ప్రాణనాథ అచ్యుతాదాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి,కౌన్సిలర్ దారుణం అరుణ,ఆడేపు శ్రీహరి కోడం అశోక్, గాజుల రవి,సిరిసిల్ల తిరుపతి,మంగళారపు ప్రభాకర్ హాజరై అభిషేకంలో పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి పోటీల్లో రాయికల్ విద్యార్థుల ప్రతిభ

**సూర్య,రాయికల్**

కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్ లో స్టేట్ లెవెల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్షిప్ 2024 పోటీలు జరిగాయి. గ్రాండ్ మాస్టర్ కంటేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఇందులో రాయికల్ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్లు కనుక ప్రభాకర్,కనుక ప్రవీణ్‌ల వద్ద శిక్షణ పొందిన 11మంది విద్యార్థులు పతకాలు సాధించారు.రాయికల్‌కు చెందిన ముక్కెర శ్రీచందన,గంగాధరి హన్సీత్, కండ్లపల్లి శశాంక్ చందోలి ప్రణీత, పెరుమండ్ల విహారిలు బంగారు పతకాలు సాధించగా,వేల్పుల సాత్విక్,యశోద సాహిత్య, పెరుమండ్ల విశ్వశ్రీలు వెండి పతకాలు, ఇంద్రాల చైత్రిక,వేల్పుల ప్రహర్షిత,స్తంభం నిత్యలు రజత పతకాలు సాధించారు.వీరిని పలువురు అభినందించారు.



## ఆర్యవైశ్య మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**సూర్య,రాయికల్**

ఆర్యవైశ్య మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు మైలారపు లింబాద్రి అన్నారు.ఆదివారం రాయికల్ పట్టణంలో పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం నూతన ప్రమాణ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లింబాద్రి మాట్లాడుతూ మహిళలు ఇంటికి పరిమితం కాకుండా, అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు.సంఘ పటిష్టత కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ రమాదేవి,కౌన్సిలర్ అనురాధ,రాయికల్ పట్టణ అధ్యక్షులు కూరగాయల రవి,మండల అధ్యక్షులు గంపా ఆనందం,మెట్పల్లి పట్టణ అధ్యక్షులు మైలా రపు రాంబాబు,.రాష్ట్ర నాయకులు కటకం రాజేశ్,పట్టణ ఆర్యవైశ్య మహిళ అధ్యక్షురాలు జిల్లాల లావణ్య, ప్రధాన కార్యదర్శి సిద్ధంశెట్టి స్వప్న, కోశాధికారి అయిత మాధవి తోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# రారా కన్నయ్య...రారా గోపాల..మురిపాల ముద్దుల గోపయ్య

## - నేడు వాడ వాడలా గోకుల అష్టమి వేడుకలు - ఇంటిటా చిన్ని కృష్ణుని,గోపికల సంబరాలు

సూర్య, రాయికల్



జయ కృష్ణా ముకుందా మురారీ,జయ గోవింద హరే మురారి.రారా కన్నయ్య,రారా గోపాల,మురిపెంగా రావయ్యా ముద్దుల గోపయ్య అంటూ పల్లె పట్టనాన,వీధి వాడనా,గోకుల అష్టమి వేడుకలతో,ఇంటింటా చిన్ని కృష్ణుని, గోపికల కనువిందైన వేషా దారణ చిలిపి చేష్టల మధ్య శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు యువకులు ప్రజలు సన్నద్ధమయ్యారు.హిందూ పంచాంగం ప్రకారం, ప్రతి ఏడాది శ్రావణ మాసంలో క్రిష్ణ పక్షంలో వచ్చే అష్టమి తిథి నాడు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున ప్రపంచ వ్యాప్తంగా జన్మాష్టమి లేదా గోకులాష్టమి వేడుకలను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణాష్టమి ప్రాముఖ్యత, కన్నయ్య లీలల గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుందాం.

### వేణు మాధవుని లీలలు.. వెల కట్టలేనివి.

వేణు మాధవుడు లోకానికి గురువు.గీతను బోధించి లోకంలో ఉండే ప్రతి ఒక్కరికీ దారి చూపాడు.చిన్నతనంలో కన్నయ్య అల్లరి పిల్లాడుగా,తన చిలిపి చేష్టలతో జీవిత పరమార్థాన్ని వివరించాడు.వెన్న దొంగగా మారి గోపికలతో పాటు అందరి మనసులను దోచుకున్నాడు.గోప బాలకుడిగా,సోదరునిగా, అసురసంహారిగా,ధర్మ సంరక్షకుడిగా ఎన్నో పాత్రలు పోషించాడు.కన్నయ్య ఎన్ని పాత్రలు పోషించినా అంతా లోక కళ్యాణం కోసమే.అందుకే కన్నయ్యను అందరు బాగా ఇష్టపడతారు. అందుకే కృష్ణాష్టమి వస్తోందంటే చాలు.. దేశవ్యాప్తంగా సందడి నెలకొంటుంది.ఈ పవిత్రమైన రోజున చిన్నారులను కన్నయ్య రూపంలో అలంకరించి పూజిస్తారు.ఈ వ్రతాన్ని ఆచరించిన వారికి కోరిన కోరికలన్నీ నెరవేరుతాయని నమ్ముతారు.ఈ నేపథ్యంలో ఈ ఏడాది కృష్ణాష్టమి ఆగస్టు 26వ తేదీ సోమవారం నాడు వచ్చింది.

### కృష్ణాష్టమి విశిష్టత..కన్నయ్య జన్మ రహస్యం..

భాగవతం ప్రకారం.. పరమ రాక్షసుడైన కంసుడి చెల్లెలు దేవకి.తనకి ఆమె అంటే ఎంతో ప్రేమ. తనకు వసుదేవుడితో వివాహం జరిపించి అత్తారింటికి పంపే సమయంలో ఆకాశవాణి తన చెల్లెలి కడుపులో ఎనిమిది సంతానంగా పుట్టే కుమారుడు కంసుడిని అంతమొందిస్తాడని చెబుతుంది.దీంతో ఆగ్రహానికి గురైన కంసుడు తన చెల్లెలు దేవకి,బావ వసుదేవులను కర్మాగారంలో బంధిస్తాడు.వారికి పుట్టిన బిడ్డలను పురిట్లోనే చంపేస్తుంటాడు.అలా ఏడుగురు చిన్నారులను కోల్పోయిన దేవకి,ఎనిమిదోసారి గర్భం దాలుస్తుంది.ఆ బిడ్డ తన అంతు చూస్తాడని కంసుడికి ముందుగానే తెలుసు కాబట్టి కారాగారం వద్ద భద్రతను మరింత పటిష్టం చేస్తాడు.అయితే నెలలు నిండిన దేవకి శ్రావణ మాసంలో బహుళ అష్టమి నాడు రోహిణి నక్షత్రం వేళ అర్ధరాత్రి వేళ శ్రీ కృష్ణుడు జన్మించాడు.తనని ఎలాగైనా రక్షించాలనుకుంటారు దేవకీ వసుదేవులు.అదే సమయంలో ఆ చిన్నారి శ్రీ విష్ణుమూర్తిగా ప్రత్యక్షమై ఏం చేయాలో వివరిస్తాడు. వెంటనే వసుదేవుని సంకెళ్ళ తెగిపోతాయి.కారాగారం తలుపులు తెరచుకుంటా యి.సైనికులు సొమ్మసిల్లి పడిపోతారు.ఆ బాల కృష్ణుడిని వసుదేవుడు బుట్టలో నిద్రపుచ్చి రేపల్లెకు బయలుదేరుతాడు. అప్పుడు దారిలో కుండపోతగా వర్షం కురుస్తుంది. కన్నయ్యపై వర్షపు చినుకులు పడకుండా ఆదిశేషుడు పడగలా మారి గొడుగు పడతాడు.ఆ తర్వాత వసుదేవుడు యమునా నది దాటుకుంటూ వెళ్లి రేపల్లె చేరుకుంటాడు.అక్కడ యాదవ రాజైన నందుని భార్య యశోద ఆడపిల్లకు జన్మనిస్తుంది.అది గమనించిన వసుదేవుడు కన్నయ్యను యశోద పక్కన పడుకోబెట్టి,ఆడపిల్లను తన చేతుల్లోకి తీసుకుని అక్కడి నుంచి తిరిగి కారాగారానికి తీసుకెళ్తాడు. అప్పుడు తన సంకెళ్ళు వాటికవే పడతాయి. భటులు మేల్కొంటారు.పసిబిడ్డ ఏడుపులు విని కంసుని సమాచారం చేరవేస్తారు.ఆకాశవాణి చెప్పిన ప్రకారం మగ బిడ్డ పుట్టాలి.ఆడపిల్ల పుట్టిందని,తన వల్ల కంసుడికి ఎలాంటి ప్రమాదం ఉండదని దేవకి ఎంత బతిమాలినా కంసుడు పట్టించుకోకుండా చంపడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడే ఆ పాప యోగ మాయగా మారి. కంసుడికి దొరక్కుండా పైకి ఎగిసి "నిన్ను చంపేవాడు పుట్టాడు.రేపల్లెలో పెరుగుతున్నాడు" అని చెప్పి మాయమవుతుంది.మరోవైపు రేపల్లెలో నందుడి ఇంట మగ బిడ్డ జన్మించడంతో రేపల్లెలో పెద్ద ఉత్సవం జరిపిస్తారు.అదే గోకులాష్టమిగా ప్రసిద్ధికెక్కింది.

### వేణు మాధవుని దివ్య ఆశీస్సుల కోసం చేయాల్సిన పనులు

శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజున కన్నయ్యకు వెండి వేణువును సమర్పించాలి.వేణు మాధవుడికి వేణువు లేకుండా పూజ పూర్తి కాదని పండితులు చెబుతారు.అందుకే ఈ స్వామిని మురళీధరుడని కూడా అంటారు.పూజ పూర్తయిన తర్వాత దాన్ని మీ దగ్గర లేదా మీరు డబ్బులు దాచుకునే చోట భద్రంగా దాచుకోవాల నీ,ఇలా చేయడం వల్ల వేణు మాధవుని ఆశీస్సులు లభిస్తాయని పురోహితులు పేర్కొంటున్నారు.జన్మాష్టమి రోజున కన్నయ్యకు ఎంతో ఇష్టమైన వెన్న,రాతి పంచదార(కండచక్కెర)ను నైవేద్యంగా సమర్పించాలి.ఈ నైవేద్యాన్ని ఏడాదిలోపు పిల్లలకు తినిపించాలి.అలాగే అందంగా అలంకరించబడిన ఊయల తెచ్చి శ్రీ క్రిష్ణుడి విగ్రహంతో తూకం వేయాలి.శ్రీ కృష్ణాష్టమి రోజున నైవేద్యాలు లేని పూజ అసంపూర్ణమని పండితులు చెబుతారు.అందుకే ఈ పండుగ పూట ఏ ప్రసాదం చేసినా,అందులో తులసి దళాన్ని తప్పనిసరిగా సమర్పించాలి.ఎందుకంటే తులసి శ్రీ క్రిష్ణుడికి ఎంతో ప్రీతికరమైనది.ఈ పండుగ వేళ తులసి దళాన్ని సమర్పించడం వల్ల కన్నయ్య అనుగ్రహం సులభంగా దొరుకుతుందని చాలా మంది నమ్ముతారు.అలాగే రక్షా బంధన్ రోజున శ్రీకృష్ణుడికి రాఖీ ఎలా కడతారో,ఈ పండుగ పూట శ్రీ క్రిష్ణుడికి,బలరాముడికి రాఖీ కట్టాలి.అదే విధంగా కన్నయ్యకు ఇష్టమైన మల్లెపువ్వులు, పారిజాతం లేదా దేవగాని పువ్వులను సమర్పించాలి.శ్రీకృష్ణుని పూజలోనూ వీటిని వాడొచ్చు.శ్రీ కృష్ణాష్టమి రోజున ధార్మిక స్థలానికి వెళ్లి మీ సామర్థ్యం మేరకు పండ్లు,ధాన్యాలు, బట్టలను దానం చేయాలనీ పురోహితులు చెబుతున్నారు.ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని వాడవాడలా ఉట్టి కొట్టడానికి యువకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.ఇస్కాన్,శ్రీకృష్ణ ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరగనున్నాయి.

# డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

## - నాటి నుంచి నేటి వరకు బీసీలను అణిచి వేస్తుండ్లు - సమాజం కోసం ఆలోచన చేసిన గొప్ప వ్యక్తి బీపీ మండల్ - మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

సూర్య, మంథని



ఎన్నికల సమయంలో ఓట్ల కోసం బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌పార్టీకే దక్కుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బీసీల ఆరాధ్యదైవం, బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని బీపీ మండల్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కామారెడ్డి బీసీల డిక్లరేషన్ అమలుచేయాలని బీసీ హక్కుల దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం దగా అని, ఆనాటి నుంచి నేటి వరకు అదే విధంగా పాలన అందిస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్‌ల విషయంలో ఆనాడు నెహ్రూ పూటకో మాట మాట్లాడి, రోజుకో విషయం చెప్పి బీసీ రిజర్వేషన్‌కు అడ్డుపడ్డాడని ఆయన గుర్తు చేశారు. రెండువేల ఎకరాల భూస్వామిగా ఉన్న బిందేశ్వరి ప్రసాద్ సమాజం ఆకలి కన్నీళ్లు అర్థం చేసుకుని ఈ సమాజం కోసం ఆలోచన చేసిన గొప్ప మహనీయుడని అన్నారు. దేశమంతా తిరిగి బీసీల కష్టాలు, న్యాయమైన కోరికలు తెలుసుకుని రిజర్వేషన్‌లతోనే న్యాయం జరుగుతుందని కేంద్రానికి, రాష్ట్రపతికి బీసీలకు 27శాతం రిజర్వేషన్లు ఉండాలని, రిజర్వేషన్లు నిండకపోతే మూడేళ్ల ఆ రిజర్వేషన్లు ఉండాలని, ప్రైవేట్ సెక్టార్‌తో పాటు ప్రమోషన్‌లలో కూడా ఉండాలని ప్రతిపాదనలు పంపారని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఉపన్యాసాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటన చేసి ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయడం లేదన్నారు. అయితే బీసీల కోసం పోరాటం చేసిన బీపీ మండల్‌తో పాటు అట్టడుగు వర్గాల కోసం త్యాగా లు చేసిన మహనీయుల చరిత్రను తెలియకుండా చేసి ఒకే కుటుంబం ఇక్కడ రాజ్యమేలుతోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీకి మోసం చేయడం అనాదిగా వస్తున్న నీతి అని, కాంగ్రెస్ పార్టీ నైజాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ డిక్లరేషన్ అమలు చేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బీసీలంతా చైతన్య వంతులై మహనీయుల స్ఫూర్తితో ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# యువత గంజాయికి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

## - గోదావరిఖని టూ టౌన్ సిఐ ప్రసాదరావు

సూర్య కమాన్‌పూర్



యువత గంజాయి కి డ్రగ్స్ కు దూరంగా ఉండాలని గోదావరిఖని టూ టౌన్ సిఐ ఎం ప్రసాదరావు కమాన్ పూర్ ఎస్సై కొట్టె ప్రసాద్ లు అన్నారు. శనివారం రాత్రి కమాన్ పూర్ మండ లం రొంపి కుంట గ్రామంలో పోలీస్ కళాబృందం చే కళా ప్రదర్శన నిర్వ హించారు. ఇందులో మూఢనమ్మకాలు గంజాయి సైబర్ నేరాలు తోపాటు మంత్ర తంత్రాలపై కళాబృందం వారు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రసాదరావు కొట్టే ప్రసాద్ లు మాట్లాడుతూ నేటికీ గ్రామాల్లో మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయని వాటిని విడనాడాలని అన్నారు. అలాగే చాలా వరకు సైబర్ క్రైమ్ లో జరుగుతున్నాయని ఏదైనా ఓటిపి వస్తే ఎవరికి కూడా చెప్పకూడదని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో నేడు యువత పెడదారిన పడుతున్నారని గంజాయి డ్రగ్స్ మద్యానికి అలవాటు పడుతున్నారని వాటిని విడనాడాలని అన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కటకం రవీందర్ కమ్మగొని మల్లయ్య చిందం తిరుపతి తోపాటు సిబ్బంది వెంగళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

సూర్య కమాన్‌పూర్

కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్ (36) అనే యువకుడు మద్యానికి బానిసై ఆదివారం ఉదయం కరీంనగర్లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో ఏదో గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి ఇంటి ముందు వాంతులు చేసుకోవడం చూసిన స్థానికులు 108 అంబులెన్సులో చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం వేకువ జామున మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు తెలిపారు. భార్య రజిత పిర్యాదు మేరకు కమాన్ పూర్ ఎస్. ఐ కొట్టె ప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆదివరాహస్వామి క్షేత్రంలో భక్త జన సందోహం

సూర్య కమాన్‌పూర్



కమాన్ పూర్ మండల కేంద్రంలోని సుప్రసిద్ధ ఆదివరాహస్వామి పుణ్యా క్షేత్రంలో ఆదివారం భక్త జనులతో కిటకిటలాడింది. మండల పరిసర ప్రాంతా లతో పాటు సుదూర ప్రాం తాల నుండి అధిక సంఖ్యలో భక్త జనులు శ్రావణమాసం లో స్వామి వారి దర్శనం కోసం తరలివచ్చారు. ఈ నేపథ్యంలో రోజు వారిగా కంటే ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా భక్తులు వచ్చారు.

# రామగుండం ఎన్టీపీసీకి ఐదు జాతీయ అవార్డులు

సూర్య-గోదావరిఖని



రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్ట్ ఐదు ప్రతిష్టాత్మకమైన టస్కర్ జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. శనివారం కోజికోడ్‌లోని తాజ్ గేట్‌వేలో జరిగిన కార్యక్రమంలో పిడబ్ల్యుడి, పర్యాటక శాఖ మంత్రి పిఎ మహమ్మద్ రియాస్ ఇట్టి అవార్డులను అందించారు. గ్రామీణ క్రీడల ప్రమోషన్‌లో నైపుణ్యం, సోషల్ అవేర్‌నెస్ యాడ్ ఫిల్మ్, హెచ్ఆర్ వైవిధ్యం, చేరిక లో బంగారు అవార్డులు, పీపుల్‌ఓరియెంటెడ్ ప్రాక్టీసెస్ (హెచ్ఆర్), సిఎస్ఆర్ ఇన్నోవేషన్ లో కాంస్య అవార్డులను దక్కించుకుంది. ఇట్టి అవార్డులను ఇక్కడి ఎన్‌టీపీసీ హెచ్ఆర్ సీనియర్ అసిస్టెంట్ ప్రజ్ఞాన్ ప్రియదర్శిని, కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్ రూపాలి రంజన్ మహమ్మద్ రియాస్ చేతుల మీదుగా అందుకున్నారు.

# మన చెరువులు, కుంటలు భద్రమేనా...!?

## - కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**సూర్య, హుజురాబాద్**

హైదరాబాద్ లో చెరువుల ఆక్రమణల దారులపై హైడ్రా కొరడా ఝుల్పిస్తుండడంతో హుజురాబాద్ లో కూడా చెరువులు, కుంటలు భద్రమేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హుజురాబాద్ లో కూడా కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హుజురాబాద్ పట్టణంలో మోడల్ చెరువు, గుండ్ల చెరువు, గంగోని కుంట, బట్టోని కుంట, చంద్రకొని కుంట, చిలుక వాగులు ప్రజల తాగు, సాగు నీటి అవసరాల కోసం ఉన్నాయి. వీటి ద్వారా హుజురాబాద్ ప్రాంతంలోని నీటి అవసరాలు తీరేవి. హుజురాబాద్ పట్టణంలో కాలక్రమేన జనాభా పెరగడం, ప్రజా అవసరాలు పెరగడంతో కుంటలు, చెరువులు, వాగులను కొంతమంది ఆక్రమించుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలో వాగులు, కుంటలు క్రమక్రమంగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. బట్టోనికుంట ప్రస్తుతం ఆనవాలు లేకుండా ఏ పరిస్థితిలో ఉంది. పలువురు రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ పలుకుబడితో పలు ప్రభుత్వ భూములను, శిఖం భూములను, ఎక్సాల్ పట్టా భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేశారు. హుజురాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ స్థలాలు ఇప్పటికే ఆక్రమణకు గురయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల భూమిని సైతం ఆక్రమించుకున్నారని, ఆంజనేయస్వామి దేవాలయ భూములు సైతం ఆక్రమించుకున్నారు. కోర్టులో కేసులు కూడా నడుస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, మామూళ్లకు ఆశపడి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా చూసి చూడనట్లు వ్యవహరించారు. దీంతో చెరువుల కింద ఉండే ఆయకట్టు భూములే కాకుండా ఎఫ్టిఎల్ బఫర్ జోనుల భూములు కూడా కొంత ఆక్రమణకు గురయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. హుజురాబాద్ లో కూడా ప్రభుత్వ స్థలాలు, కుంటలు, చెరువుల భూముల పరిరక్షణకు హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేసి స్థలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**కబ్జాదారుల పై చర్య తీసుకోండి..**

హుజురాబాద్ పట్టణంలో పలు చెరువుల, కుంటల, కాలువల భూములు కొంతమంది కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని టిఆర్ఎస్ నాయకులు కొలిపాక సమ్మయ్య ప్రభుత్వ అధికారులను కోరారు.

## ఘనంగా బిపి మండల్ జయంతి వేడుకలు

**సూర్య, హుజురాబాద్**



బిసి రిజర్వేషన్ల జాతిపిత బిపి మండల్ 106వ జయంతి వేడుకలు ఆదివారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బీహార్ కు చెందిన భూపేంద్ర ప్రసాద్ మండల్ బీసీల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశాడని, మొరార్జీ దేశాయ్ కాలంలో బీసీల కోసం దేశమంతా తిరిగి 27 శాతం రిజర్వేషన్ ఉండాలని ప్రతిపాదించారని అన్నారు. బిపి సింగ్ ప్రధాని గా ఉన్న కాలంలో ఆయన సిఫార్సులు ఆమోదించారని, కానీ రాజకీయ కారణాల వల్ల అమల్లోకి రాలేదని అన్నారు. ఆయన ఆశయాలను పూర్తిచేస్తే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బీసీ నాయకులు సాదుల రవీందర్ బాబు, రిటైర్డ్ హెచ్ఎం వేల్పుల రత్నం, కొన్ని రాజిరెడ్డి, జన్నయ్య, రామచంద్రం, మునీరుద్దీన్ పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలోని నలంద హైస్కూల్ 1993–94 సంవత్స రంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆది వారం హుజురాబాద్ పట్టణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ చిన్ననాటి స్మృతు లను నెమరు వేసుకున్నారు. అప్పుడు చదువుకున్న తమ స్నేహితులను, ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. తాము ఎంత ఎదిగిన పాత వారిని మరచిపోలేదని మరిచిపోమని మరోకసారి కలుసుకోవాలని అనుకున్నారు. ఈ కార్యక్రమంలో గాజుల సునీల్, దాసరి రాజేందర్ రెడ్డి, కంకణాల రమేష్ రెడ్డి, రమణారెడ్డి, మంద వేణుగోపాల్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో రాయికల్ విద్యార్థుల ప్రతిభ

**సూర్య,రాయికల్**

కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్ లో స్టేట్ లెవెల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్షిప్ 2024 పోటీలు జరిగాయి. గ్రాండ్ మాస్టర్ కంటేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఇందులో రాయికల్ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్లు కనుక ప్రభాకర్,కనుక ప్రవీణ్‌ల వద్ద శిక్షణ పొందిన 11మంది విద్యార్థులు పతకాలు సాధించారు.రాయికల్ కు చెందిన ముక్కెర శ్రీచందన,గంగాధరి హన్సిత్, కండ్లపల్లి శశాంక్ చందోలి ప్రణీత, పెరుమండ్ల విహారిలు బంగారు పతకాలు సాధించగా,వేల్పుల సాత్విక్,యశోద సాహిత్య, పెరుమండ్ల విశ్వశ్రీలు వెండి పతకాలు, ఇంద్రాల చైత్రిక,వేల్పుల ప్రహర్షిత,స్తంభం నిత్యలు రజత పతకాలు సాధించారు.వీరిని పలువురు అభినందించారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**- కేంద్రం ఏకీకృత పెన్షన్ పథకం ప్రకటన సరికాదు**

**- టిసిపిఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్**

**సూర్య గన్నేరువరం**



దేశంలో సిపిఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్స్ స్కీం (యూపీఎస్) పథకాన్ని కేంద్రం ప్రకటించడం సబబు కాదని యుపిఎస్ విధానం ఉద్యోగులకు నష్టం కలిగిస్తుందని టీసిపిఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. ఆదివారం హన్మండ్ల భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ సిపిఎస్ స్థానంలో యుపిఎస్ అమలును అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. 25 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ ఉంటుందని సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 50% పెన్షన్ ఇస్తామని కేంద్రం వెల్లడించింది కానీ చెందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడం బాధాకరమని అన్నారు. ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా సర్వీసును బట్టి 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తేనే ఉద్యోగులకు వారి కుటుంబాలకు లాభం చేకూరుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం యుపిఎస్ అమలు ప్రకటనను వెనక్కి తీసుకోవాలని లేనియెడల రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యుపిఎస్ అమలు చేసే ఆలోచన చేస్తాయని అన్నారు కాంగ్రెస్ మేనిఫెస్టోలో సిపిఎస్ రద్దు కోసం స్పష్టమైన హామీ ఇచ్చిందని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## హైడ్రాతరహా వ్యవస్థను

### తక్షణమే జిల్లాలకు మండలాలకు విస్తరింప చేయాలి

**- సిపిఐ తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి**

**సూర్య తిమ్మాపూర్**



కరీంనగర్ జిల్లాలో చెరువులు కుంట శిఖం భూములు ఎస్సారెస్పీ భూములు కబ్జాలకు గురై నిర్మాణాలు చేపట్టినారు. వీటన్నిటిని వెలికి తీయాలంటే హైడ్రా తరహా వ్యవస్థ తక్షణమే జిల్లాలకు మండలాలకు రావాలని తెలపడం జరిగింది. బోయిని తిరుపతి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో ప్రభుత్వ భూములలో కళాశాలలు నిర్మించి యతేచగా నడుపుకుంటున్నారు. వీరికి ఆర్థిక అంగ దన బలం ఉండడం వల్ల రెవెన్యూ వ్యవస్థ వీరిని ఏం చేయలేకపోతోంది కావున హైడ్రా లాంటి వ్యవస్థ కరీంనగర్ జిల్లాకు రావడంతోనే మొదటగా సిపిఐ పక్షాన ఫిర్యాదు చేయనీకి సిద్ధంగా ఉన్నాము అని తిరుపతి తెలపడం జరిగింది. అలాగే మండలంలో ఎస్సారెస్పీకి సంబంధించినటువంటి భూములు రియాల్టర్ల చేతిలో కబ్జాల గురై ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో చెరువులు కుంట శిఖములలో నిర్మాణాలు కూడా చేపట్టినారు వీటన్నిటిని కాపాడాలంటే హైడ్రా లాంటి వ్యవస్థ తక్షణమే జిల్లాలకు మండలాలకు వర్తింప చేసే విధంగా ప్రభుత్వం త్వరితగరితన చర్యలు తీసుకోవాలని బోయిని తిరుపతి ప్రభుత్వన్ని కోరడం జరిగింది.

## సీఐ తిరుమల్‌కు సన్మానం

**సూర్య, హుజూరాబాద్**

హుజూరాబాద్ పట్టణ సీఐ తిరుమల్ గౌడ్‌ను ఆదివారం బిఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్ రెడ్డి, అపరాజ ముత్యంరాజు, నాయకులు గందె శ్రీనివాస్ లు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల బదిలీపై వచ్చిన సీఐ తిరుమల్ గౌడ్‌ను పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించిఅభినందనలు తెలిపారు.

## చెరువుల ఆక్రమణల పై సమాచారం ఇవ్వండి

**- ప్రకృతి పరిరక్షణకు ముందుకు రండి**

**- మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు**

**సూర్య, ఇల్లందకుంట**



ఇల్లందకుంట మండలంలోని 18 గ్రామాలలో చెరువుల ఆక్రమణలపై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని రామారావు పిలుపునిచ్చారు. ప్రకృతి పర్యావరణాన్ని కాపాడాలని చెరువుల ఆక్రమణ పై అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాజంలో మన బాధ్యతగా ముందుగా చెరువు కుంటల విస్తీర్ణం తెలుసుకొని, చెరువులు కుంటలు ఆక్రమణకు గురి అయితే దానికి సంబంధించిన అధికారులకు సమాచారం తెలియజేయాలన్నారు. వాటి వెనుక ఎంత పెద్ద వాళ్ళు ఉన్నా ఏ పార్టీ వారైనా సమాచారాన్ని తెలియజేస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు జరుగుతున్న కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వం ఎవరి మీద కక్షపూరితంగా ఉద్దేశపూర్వకంగా వ్యవహరించదని అన్నారు. ఇది వ్యక్తుల మీద పార్టీల మీద జరుగుతున్న పోరాటం ఎంత మాత్రం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరివర్తన తేవాలని చేస్తున్న చర్య అని ప్రజాపాలనలో తీసుకున్న సుపరిపాలన దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. చెరువులను కాపాడండి భావితరాలకు బంగారు బాటలు వేయండి మీ గ్రామాల్లోని చెరువుల్లో నీరు నిలువ ఉంటేనే అందరికి సౌలభ్యంగ ఉంటుందన్నారు. చెరువుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు.. ఈ రోజు సమాజంలో మన బాధ్యతగా మనం భవిష్యత్ తరాలకు ఇచ్చే వరం ఇది అన్నారు.

## కవి, రచయిత్రి కిరణ్మయికి ఘన సన్మానం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణానికి చెందిన కవి, రచయిత్రి, ఉపాధ్యాయురాలు రావుల కిరణ్మయిని ఆదివారం ఆమె రచనల ఆవిష్కరణల సందర్భంగా ఘనంగా సన్మానించారు. హన్మకొండ లో చక్రవర్తులు రాధాకృష్ణ సాహితి వేదిక ఆధ్వర్యంలో రావుల కిరణ్మయి రచించిన బొడ్రవుతు కథ సంపుటి, పీవీ నరసింహారావు ఉయ్యాల పాట పుస్తకాల ఆవిష్కరణ ఎమ్మెల్సీ, పీవీ నరసింహారావు కుమార్తె సురభి వాణి దేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత్రి రావుల కిరణ్మయి రచనలను పలువురు ప్రశంసించారు. మహిళలు సాహిత్య రంగంలో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. స్వర్గీయ పీవీ నరసింహారావు చరిత్రను ఉయ్యాల పాట రూపంలో రాయడం గొప్పదైనదని, తెలంగాణ భాష, వ్యాస పట్ల ఆమెకున్న పట్టు అనన్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తో పాటు రాధాకృష్ణ సాహితి వేదిక అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మహమ్మద్ రియాజ్, ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, జానపద విజ్ఞానవేత్త ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి, కల్వకుంట వెంకట సంతోష్ బాబు, రావుల పుల్లాచారి, బివిఎన్ స్వామి, మేరుగు అనురాధ, డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు, కానుగుల భద్రయ్య, గుండు రవి, పోలోజు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## మారథాన్ లో కమిషనరేట్ ఎస్ఐ ప్రతిభ

**- నిర్దేశిత గడువులో పూర్తి**

**సూర్య, సెంటినరీ కాలనీ**

హైదరాబాద్ రన్నర్ ఆద్వర్యం లో నేషనల్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సౌజన్యం తో ఆదివారం హైదరాబాద్ లో నిర్వహించిన మారథాన్ లో రామగుండం కమిషనరేట్ లో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ కటికే రవిప్రసాద్ నిర్దేశిత సమయంలో పూర్తి చేసి శభాష్ అనిపించుకున్నారు. దేశంలోని అత్యంత ప్రతిష్టంగా భావించే ఈ మారథాన్ హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభించి గచ్చిబౌలి స్టేడియం (42 కిలో మీటర్లు) ఆరున్నర గంటల్లో పూర్తి చేయాల్సి ఉంది. అయితే రవి ప్రసాద్ కేవలం 5 గంటల్లో పూర్తి చేసి మెడల్ సాధించి యువతకు స్ఫూర్తి గా నిలిచారు.మొత్తం ప్రపంచ వ్యాప్తంగా 1625 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. గతంలో ప్రతిష్మాత్మకమైన బొంబాయి హాఫ్ మారథాన్ పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. మారథాన్ లో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ రవిప్రసాద్ .యువతకు స్ఫూర్తి నిలిపేందుకే ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**సూర్య కరీంనగర్ టౌన్**

45 డివిజన్ కు చెందిన దండు వరలక్ష్మి 100 మంది మహిళలు, యువకులు పురుమల్ల శ్రీనివాస్, దండు మధు ఆధ్వర్యంలో కాంగ్రెసులో చేరినారు.